సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

సోమవారం । 16 । డిసెంబర్ । 2024



తలుపులమ్మకు సువర్ణ ముత్యాల హారం

తుని రూరల్: తలుపులమ్మకి కృష్ణాజిల్లా కానూరుకి చెందిన దండు వర్మరాజు దంపతులు రూ.80వేలు విలువ చేసే బంగారు ముత్యాల హారాన్ని సమర్పించారు. ఈఓ విశ్వనాథరాజు వారిచే పూజలు చేయించారు.




ఊరికి పండగొచ్చింది..

తెలుగు సంస్కృతి, సనాతన సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలకు ప్రతీకగా నిలిచే మకర సంక్రాంతికి పల్లె సీమలు ముస్తాబవుతున్నాయి.

8లో

12,600 క్యూసెక్కుల నీరు విడుదల



ధవళేశ్వరం: గోదావరి డెల్టా కాలువలకు ఆదివారం 12,600 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 4,800, మధ్య డెల్టాకు 2,300, పశ్చిమ డెల్టాకు 5,500 క్యూసెక్కుల నీటిని వదిలారు. బ్యారేజ్ వద్ద 10.90అడుగులకు నీటిమట్టం చేరింది.

న్యూస్‌రీల్

అమరజీవి పొట్టి శ్రీరాములు



కలెక్టరేట్‌లో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న కలెక్టర్ మహేష్ కుమార్

అమలాపురం రూరల్: ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటుకు ఆమరణ నిరాహార దీక్ష చేసి అమరజీవిగా పొట్టి శ్రీరాములు నిలిచారని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ తెలిపారు. ఆదివారం అమలాపురంలోని కలెక్టరేట్‌లో పొట్టి శ్రీరాములు ప్రాణ త్యాగాన్ని స్మరించుకుంటూ ఆత్మార్పణ, వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటులో కీలకపాత్ర పోషించిన మహనీయుడు పొట్టి శ్రీరాములు అన్నారు. సామాజిక న్యాయం, దళితుల అభ్యున్నతి కోసం పోరాడారన్నారు. తెలుగు మాట్లాడే ప్రజలందరికీ ఒక రాష్ట్రం ఏర్పాటు చేయాలన్న ఉద్దేశంతో శ్రీరాములు ఆమరణ దీక్ష చేశారన్నారు. బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారి టీవీ ప్రసాద్ మాట్లాడుతూ 1952లో ప్రత్యేక రాష్ట్రం కావాలని డిమాండ్ చేస్తూ శ్రీరాములు 58 రోజుల ఆమరణ నిరాహార దీక్ష చేసి ఆత్మార్పణ చేసుకున్నారన్నారు. వికాస జిల్లా మేనేజర్ జి.రమేష్, కో ఆర్డినేషన్ సెక్షన్ సూపరింటెండెంట్ మురళీకృష్ణ, రవికిరణ్, భరత్, వెనకబడిన తరగతుల వసతి గృహ సంక్షేమ అధికారులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో సమయ పాలన పాటించాలి



షేక్ సలీమ్‌బాషా, డీఈఓ

అమలాపురం టౌన్: జిల్లాలోని ఎంఈఓలు, డీవైఈఓలు, అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు పాఠశాలల నిర్వహణపరంగా డీఈఓ షేక్ సలీమ్ బాషా కొన్ని మార్గదర్శకాలు జారీ చేశారు. ఈ మేరకు ఆయన అమలాపురంలో ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. పాఠశాలల్లో విధిగా సమయ పాలన పాటించాలని సూచించారు. పాఠశాలల ప్రారంభ సమయానికి కనీసం ఐదు నిమిషాల ముందు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు హాజరు కావాలన్నారు. రోజూ అసెంబ్లీలో, ఖాళీ పీరియడ్లలో విద్యార్థులకు నైతిక విలువలపై ఉపన్యాసాలు ఉండాలని పేర్కొన్నారు. విద్యార్థి ఒకసారి పాఠశాల హాజరైన తర్వాత తల్లి లేదా తండ్రి వచ్చినప్పుడే (అత్యవసర పరిస్థితుల్లో మినహా) బయటకు పంపించాలన్నారు. విద్యార్థులకు ఆరోగ్య సమస్యలు తలెత్తితే సమీప ఆస్పత్రికి బాధ్యతగా తీసుకు వెళ్లాలని సూచించారు. శిథిల భవనాల వద్దకు విద్యార్థులు వెళ్లకుండా నిత్యం అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. మధ్యాహ్న భోజనం ఎక్కువ మంది విద్యార్థులు తినేలా చర్యలు చేపట్టాలన్నారు. పీఈటీలు, పీడీలు పాఠశాలల ఆట స్థలాలను పరిశుభ్రంగా ఉంచడంతోపాటు పలు క్రీడల్లో విద్యార్థులకు శిక్షణ ఇస్తూ ప్రోత్సహించాలని సూచించారు. పాఠశాలల్లో కిచెన్ షెడ్లు, టాయిలెట్స్, క్లాస్ రూమ్స్‌లో శుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. పీఎంశ్రీ పాఠశాలల్లో ఒకేషనల్ ఇన్‌స్ట్రక్టర్ల సేవలను సద్వినియోగం చేసుకుంటూ విద్యార్థులకు నాణ్యమైన వృత్తి విద్యను అందించాలని డీఈఓ విజ్ఞప్తి చేశారు.

30 శాతం ఐఆర్‌ను వెంటనే ప్రకటించాలి



సదస్సులో మాట్లాడుతున్న పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణయ్య

మామిడికుదురు: ముప్పై శాతం ఐఆర్‌ను ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు మిట్టా కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఆదివారం మామిడికుదురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో విద్యా సదస్సు, జిల్లా కౌన్సిల్ సమావేశం జరిగింది. కోనసీమ జిల్లా అధ్యక్షుడు దీపాటి సురేష్‌బాబు అధ్యక్షతన జరిగిన సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొన్న కృష్ణయ్య మాట్లాడుతూ ఇంగ్లిషు, హిందీ, సోషల్ సిలబస్ భారం, ఇటీవల పెంచిన యాప్‌ల భారం తగ్గించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులు, ఉద్యోగులకు ప్రభుత్వం వెంటనే బకాయిలను చెల్లించాలన్నారు. 117 జీఓను వెంటనే రద్దు చేసి పాత విధానాన్ని అమలు చేయాలని ఆయన సూచించారు. రాష్ట్ర కౌన్సిలర్ పంగం బ్రహ్మాజీరావు, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు నరాల కృష్ణకుమార్, మండల శాఖ అధ్యక్షుడు యాళ్ల పల్లంరాజు, కార్యదర్శి చింతా రమేష్, ఆర్థిక కార్యదర్శి కడలి వెంకటదుర్గాప్రసాద్, ఎంఈఓ–2 మోకా వెంకన్నబాబు, హెచ్ఎం నిరంజని పాల్గొన్నారు.

ఉల్లి లొల్లి.. మళ్లీ మళ్లీ

- కోయకుండానే కన్నీళ్లు
- ధర చూస్తే ఉల్లిక్కిపాట్లు
- కిలో రూ.60 నుంచి రూ.70
- గత ప్రభుత్వంలో అందుబాటులో ధర
- ప్రస్తుతం కానరాని రాయితీ

ఉల్లి ధర తగ్గిందనుకుంటే మళ్లీ ఆకాశాన్నంటుతోంది.. కోయకుండానే కన్నీళ్లు రప్పిస్తోంది.. కొద్ది నెలలుగా ఈ పరిస్థితి దాపురించింది.. కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ఉల్లిని చూస్తే అమ్మో అనేలా దుస్థితి వచ్చింది.. నగటు జీవికి ఉల్లిపాయలను దూరం చేస్తోంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వీటి ధరలు పెరగకుండా చర్యలు తీసుకోనేది. రాయితీపై ప్రజలకు అందించేది. ఈ ప్రభుత్వంలో ఆ చర్యలు దాదాపు శూన్యమని చెప్పాలి.



అమలాపురం టౌన్/ అంబాజీపేట: ఉల్లి ధర రోజురోజుకూ కొండెక్కుతోంది. ఇది జనానికి అందనంత దూరం అవుతోంది. గత ఆరు నెలల నుంచి ఒక్కసారిగా పెరగడం ఆపై కొంచెం తగ్గడం, మళ్లీ పెరగడం ఆందోళన కలిగిస్తోంది. రెండు నెలలుగా కిలో రూ.50 పలికిన ఉల్లి మళ్లీ వారం రోజులుగా పెరుగుతోంది. ఇప్పుడు మార్కెట్‌లో నాణ్యతను బట్టి రూ.60 నుంచి రూ.70కి చేరుకోవడంతో వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. కూరగాయల దుకాణాలకు వెళ్లినప్పుడు ఉల్లి ధర విని వినియోగదారులు ఉలిక్కిపడుతున్నారు. జిల్లాలోని కూరగాయల దుకాణాల్లో అసలే పెరిగిన ధరలతో ఇబ్బంది పడుతుంటే, నాణ్యత పేరుతో మరింత పెంచి అమ్ముతుండడంతో ప్రజలు కొనేందుకు వెనకంజ వేయాల్సిన పరిస్థితి వస్తోంది. జిల్లాకు ప్రధానంగా కర్నూలు, మహారాష్ట్ర రాష్ట్రంలోని షోలాపూర్ నుంచి ఉల్లి దిగుమతి అవుతోంది.

నాణ్యత పేరు చెప్పి..

కర్నూలు జిల్లా నుంచి అంతంత మాత్రంగానే, అదీ అంతగా నాణ్యత లేని ఉల్లిపాయలు జిల్లాకు దిగుమతి అవుతున్నాయి. పూర్తి నాణ్యతతో మహారాష్ట్ర రాష్ట్రం షోలాపూర్ నుంచి ఉల్లి వస్తుండడంతో దుకాణదారులు రెండు క్వాలిటీల పేరుతో ధరలు పెంచి విక్రయిస్తున్నారు. రానున్న రోజుల్లో ఉల్లి ధర మరింత పెరిగే అవకాశం ఉందని మార్కెట్ అంచనాలను బట్టి తెలుస్తోంది. అధిక వర్షాలతో ఉల్లి పంట దెబ్బతినడంతో పాటు కర్నూలు జిల్లా పంట నాణ్యత లేకపోవడంతో ఉల్లికి డిమాండ్ ఏర్పడిందని హోల్‌సేల్ వ్యాపారులు అంటున్నారు. జిల్లాలోని దాదాపు 650 కూరగాయల దుకాణాలకు నిత్యం 70 టన్నులకు పైగానే ఉల్లి దిగుమతి అవుతోంది. కొన్ని దుకాణాల్లో కర్నూలు జిల్లా ఉల్లిని కిలో రూ.40కే విక్రయిస్తున్నారు. అయితే ఈ పాయలు చిన్నగా ఉండడమే కాకుండా నాణ్యత అంతగా లేకపోవడంతో వినియోగదారులు కొనేందుకు అంతగా ఆసక్తి చూపడం లేదు. ఇక మహారాష్ట్ర నుంచి దిగుమతి అవుతున్న పాయలు పెద్ద సైజులో ఉండడమే కాకుండా పూర్తి నాణ్యత ఉంటున్నాయి. ధర ఎక్కువైనా విధి లేని పరిస్థితుల్లో నాలుగు కిలోలు కొనే వినియోగదారుడు ఒకటి లేదా రెండు కిలోల ఉల్లిని కొని అతి జాగ్రత్తగా వాడుకుంటున్నారు. జిల్లాలోని 650 దుకాణాల ద్వారా రోజుకు రూ. 80 లక్షల నుంచి రూ.కోటి మేర ఉల్లి వ్యాపారం జరిగేది. ఇప్పుడు ధరల మోతతో ఆ వ్యాపారం రూ.1.20 కోట్లకు చేరుకుందని ఒక అంచనా. పెళ్లిళ్ల సీజన్ ఊపందుకోవడం కూడా ధరల పెరుగుదలకు ఓ కారణం చెబుతున్నారు. గడిచిన కార్తిక మాసంలో ఉల్లి వినియోగం తగ్గినా తగ్గేదేలా అన్నట్లు ధరలు మాత్రం దిగలేదు.



అంబాజీపేటలో విక్రయానికి సిద్ధంగా ఉంచిన ఉల్లి పాయలు

హడావుడే.. నియంత్రణ లేదు

నిత్యావసర వస్తువుల ధరల క్రమబద్ధీకరణకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు కూటమి ప్రభుత్వం ప్రచారం చేసి హోరెత్తించింది. ఒకటి రెండు రోజులు మాత్రమే ఈ హడావుడి కనిపించింది. ముఖ్యంగా ఉల్లి ధరల నియంత్రణకు ప్రభుత్వం తీసుకున్న చర్యలు శూన్యమనే చెప్పాలి. పప్పులు, నూనెల ధరలు తగ్గిస్తున్నట్లు విస్తృత ప్రచారమైతే చేశారే తప్ప తగ్గుదలకు వచ్చేసరికి స్వల్పంగానే కనిపించాయి. అదే గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఉల్లి ధరల సంక్షోభం వచ్చినప్పుడల్లా మార్కెట్ ఫెడ్ ద్వారా ఉల్లిని రైతు బజారులో రాయితీ ధరలకు వినియోగదారులకు విక్రయించేవారు. ఇది ప్రజలకు కొంత ఉపశమనం కలిగించేది. దీనివల్ల బహిరంగ మార్కెట్ లోనూ ఉల్లి ధర నియంత్రణలో ఉండేది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఉల్లి ధరలు మండిపోతున్నా ఇంకా నియంత్రణకు చర్యలు చేపట్టడం లేదు. జిల్లాలో కొన్నిచోట్ల పౌర సరఫరాల శాఖ ద్వారా కొన్ని కేంద్రాలు తెరిచినప్పటికీ అవి రెండు లేదా మూడు రోజులు మాత్రమే ఉల్లి పాయలను అమ్మి చేతులు దులుపేసుకుంటున్నారు.

అడ్డూ అదుపు లేకుండా..



ఉల్లి ధరలకు అడ్డూఅదుపు లేకుండా పెరిగిపోతుంది. మధ్య తరగతి కుటుంబాలకు ఆర్థిక భారంగా మారింది. ఈ ధరలు పెరిగినప్పుడు గత ప్రభుత్వంలో మార్కెట్ యార్డ్‌లు, రైతు బజార్ల ద్వారా సామాన్యులకు రాయితీతో అందించారు. మూడు నెలల కిందట ఈ ప్రభుత్వం నిత్యావసర ధరలను తగ్గిస్తూ రెండు ప్రాంతాల్లో షాపులు పెట్టి రెండు మూడు రోజుల్లో మూసేసింది. ఉల్లి ధరలను ప్రభుత్వం తక్షణమే నియంత్రించే చర్యలు చేపట్టాలి.

– కాండ్రేగుల దుర్గ, వినియోగదారుడు, మాచవరం

కొన్ని నెలలుగా ఇంతే..



మార్కెట్‌లో కొన్ని నెలలుగా ఉల్లి ధరల పెరుగుదల కొనసాగుతోంది. హోల్‌సేల్ ధర కిలో రూ.40 నుంచి రూ.60 ఉంది. ఉల్లిపాయల నాణ్యతను బట్టి ధరలు ఉంటుంది. అదే రిటైల్ మార్కెట్‌లో రూ.60 నుంచి రూ.70 వరకూ అమ్ముతున్నారు. ప్రస్తుతం రూ.60 రకాన్ని మహారాష్ట్ర నుంచి హోల్‌సేల్ రంగం దిగుమతి చేసుకుంటోంది. కార్తిక మాసంలో ధరల తగ్గుదల కనిపించలేదు. ప్రస్తుతం పెరిగిన ధరలు హోల్‌సేల్ పరంగా స్థిరంగా ఉన్నప్పటికీ రిటైల్ మార్కెట్‌లో ప్రాంతాలు, దుకాణాలను బట్టి ఒక్కో రకంగా ఉంటోంది. మరికొన్ని నెలల పాటు ఉల్లి ధరలు ఇలానే కొనసాగే అవకాశం కనిపిస్తోంది. –వాకపల్లి స్వామినాయుడు, ఉల్లి హోల్‌సేల్ వ్యాపారి, అమలాపురం

విఘ్నేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



అయినవిల్లిలో విఘ్నేశ్వర స్వామి

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వర స్వామివారి ఆలయం ఆదివారం భక్తులతో కిక్కిరిసింది. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధానార్చకుడు అయినవిల్లి సూర్యనారాయణ మూర్తి ఆధ్వర్యంలో స్వామికి మేలుకొలుపు సేవ, పంచామృతాభిషేకాలు, ఏకాదశ, లఘున్యాస అభిషేకాలు జరిపారు. అనంతరం వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. స్వామివారి లఘున్యాస, ఏకాదశ రుద్రాభిషేకాల్లో 38 మంది, లక్ష్మీగణపతి హోమంలో 31 మంది, చిన్నారులకు నామకరణలు, అక్షరాభ్యాసం, తులాభారం వంటివి జరిపారు. 24 మంది తమ నూతన వాహన పూజలు నిర్వహించారు. అన్నదాన పథకంలో 1,870 మంది అన్న ప్రసాదం స్వీకరించారు. స్వామివారికి వివిధ పూజలు, అన్నదాన విరాళాలుగా రూ.2,62,835 ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ ముదునూరి సత్యనారాయణ రాజు తెలిపారు.

పీఆర్ ఇంజినీర్ల ఆర్గనైజింగ్ సెక్రటరీగా రాంబాబు



అమలాపురం టౌన్: పంచాయతీ రాజ్ (పీఆర్) డిప్లొమా ఇంజినీర్ల అసోసియేషన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా అమలాపురం డీఈఈ అన్నం రాంబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తిరుపతిలోని ఎస్ఆర్ కన్వెన్షన్ హాలులో ఆదివారం జరిగిన అసోసియేషన్ 47వ సమావేశంలో రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గతంలో రాష్ట్ర అసోసియేషన్ కార్యవర్గంలో పనిచేసిన రాంబాబుకు మరోసారి రాష్ట్ర కార్యవర్గంలో స్థానం కల్పించారు. ఈ మేరకు రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఆయన ప్రమాణ స్వీకారం చేశారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

అమలాపురం రూరల్: జిల్లా స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదికను సోమవారం ఉదయం 10 గంటల నుంచి అమలాపురంలోని కలెక్టరేట్ గోదావరి భవన్‌లో నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని ఆదివారం జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అర్జీదారులు తమ సమస్యలను జిల్లా అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కార మార్గాలు పొందాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అలాగే డివిజన్, మండల స్థాయిల్లో కూడా ఈ కార్యక్రమం జరుగుతుందని అన్నారు.

ప్రభుత్వ ఉద్యోగుల సంఘ జిల్లా కార్యవర్గం ఎన్నిక

కడియం: ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక జరిగిందని సంఘం ప్రధాన కార్యదర్శి సీహెచ్ఎస్ విల్సన్‌పాల్ తెలిపారు. ఆదివారం ఈ మేరకు ఆయన స్థానిక విలేకరులకు వివరాలు వెల్లడించారు. శనివారం రాజమహేంద్రవరంలో ఏర్పాటు చేసిన మహాసభలో జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నామని, అధ్యక్షుడిగా పి.గిరిప్రసాద్‌వర్మ, ఉపాధ్యక్షులుగా పి.రవికుమార్, కె.సూర్య శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శిగా ఎం.శ్రీనివాసరెడ్డి, టి.మణిశ్రీలు ఎంపికైనట్లు చెప్పారు.

మెట్టుమెట్టుకీ నీరాజనం



హారతి ఇచ్చి మెట్లోత్సవాన్ని ప్రారంభిస్తున్న దేవస్థానం ఈఓ వీర్ల సుబ్బారావు, అధికారులు

- అన్నవరంలో వేడుకగా మెట్లోత్సవం
- తొలి పావంచా నుంచి సత్యదేవుడు అమ్మవార్ల ఊరేగింపు



మెట్లకు పసుపు, కుంకుమలతో పూజలు చేస్తున్న మహిళలు

అన్నవరం: మెట్టు మెట్టుకూ పసుపు, కుంకుమ రాస్తూ సత్యదేవుని దేవేరుతో ఊరేగిస్తూ భక్తులు రత్నగిరికి మెట్లోత్సవం నిర్వహించారు. మార్గశిర పౌర్ణిమ, ఆదివారం భక్తుల నీరాజనంతో రత్నగిరి ప్రత్యేక శోభను సంతరించుకుంది. మార్గశిర పౌర్ణిమిని పురస్కరించుకుని ధనుర్మాసోత్సవాల ప్రారంభానికి ఒక రోజు ముందు ఈ ఉత్సవం నిర్వహించడం ఆనవాయితీ. కొండ దిగువన తొలిపావంచా నుంచి కొండ పైవరకూ ఉన్న 450 మెట్లకు హారతి ఇచ్చి ప్రసాదాలు సమర్పించారు. తొలిపావంచా వద్ద ఉదయం 7.30కు సత్యదేవుడు, అనంతలక్ష్మి, సత్యవతీదేవిలను పల్లకిపై కొండ దిగువకు తీసుకు వచ్చి గ్రామంలో ఊరేగించి అనంతరం వేద మంత్రాల నడుమ ఈఓ వీర్ల సుబ్బారావు మెట్లోత్సవాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో దేవస్థానం ఏసీ రామ్మోహనరావు, వేదపండితులు గొల్లపల్లి గణపతి ఘనపాఠి, యనమండ్ర శర్మ, గంగాధరభట్ల గంగబాబు తదితరులతో పాటు పీఆర్వో కె.కొండలరావు, ఈఈ రామకృష్ణ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి సత్యదేవుని గ్రామోత్సవం

ధనుర్మాసోత్సవాల సందర్భంగా సోమవారం నుంచి జనవరి 14 వ తేదీ సంక్రాంతి వరకు నిత్యం ఉదయం ఏడు గంటల నుంచి పది గంటల వరకూ అన్నవరం పుర వీధుల్లో సత్యదేవుడు, అమ్మవార్ల పల్లకిపై ఊరేగిస్తారు. కనుమ పండుగ నాడు జరిగే ప్రభోత్సవంతో ధనుర్మాసోత్సవాలు ముగుస్తాయి.

సత్యదేవుని దర్శించిన 40 వేల మంది..

శనివారం రాత్రి, ఆదివారం తెల్లవారుజామున రత్నగిరిపై పెద్ద సంఖ్యలో వివాహాలు జరిగాయి. ఈ పెళ్లి బృందాలతో పాటు సాధారణ భక్తులు సుమారు 40 వేల మంది ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మూడు వేల వ్రతాలు జరిగాయి. స్వామివారి దర్శనానికి గంట, రూ.200 టిక్కెట్ దర్శనానికి అరగంట సమయం పట్టింది. వివిధ మార్గాల ద్వారా స్వామివారికి రూ.40 లక్షల ఆదాయం వచ్చింది. అలాగే ఉదయం పది గంటలకు స్వామి, అమ్మవార్ల ఊరేగింపు నిర్వహించారు.



టేకు రథంపై సత్యదేవుడు, అమ్మవారిని ఊరేగిస్తున్న దృశ్యం

వసివాడిన జీవితానికి వన్‌స్టాప్ వెలుగు

- అత్యాచార బాధితుల్ని ఆదుకున్న సఖి సెంటర్
- ఉద్యోగాలు ఇచ్చి జీవనోపాధికి చేదోడు
- బాధితులమనే వేదన నుంచి విముక్తి

కాకినాడ క్రైం: అన్నెం పున్నెం తెలియని అమాయకత్వం ఆ పసిమొగ్గలది. బోసి నవ్వులో.. పసి బాల్యాన్నో చూడాల్సిన వారి మోములో ఆ కామాంధులకు ఆడతనం కనిపించింది. అంతే వావి వరుస వదిలేశారు. చిన్న పిల్లలన్న సంగతే మరిచిపోయారు. మృగాల్లా విరుచుకుపడ్డారు. కన్న తండ్రి ఒకడు, ప్రేమ పేరుతో ఇంకొకడు, గంజాయి కొట్టి మరొకడు... ఇలా ఆటవికంగా అత్యాచారాలకు పాల్పడ్డారు. దారుణాలకు ఒడిగట్టిన వాళ్ల సంగతి చట్టం చూసుకుంటే, బాధితుల్ని మాత్రం సఖి వన్‌స్టాప్ సెంటర్ ఆదుకుంది. కామాంధుల కాలి కింద నలిగిన పసి జీవితాలు చీకటిమయం అయిపోయాయనుకున్న వేదనాభరిత క్షణాల్లో వన్‌స్టాప్ సెంటర్ వారి భవితకు భరోసా కల్పిస్తోంది. చదివించి, అండగా నిలిచి వారి ఉన్నతికి బాటలు వేసింది. తాజాగా బాధితులైన ఇద్దరికి, అంతకు ముందు పసి బాలిక తల్లికి ఉద్యోగాలు కల్పించింది. ఐసీడీఎస్ పీడీ ప్రవీణ, వన్‌స్టాప్ సెంట్రల్ అడ్మినిస్ట్రేటర్ శైలజ చొరవతో ఉద్యోగాలు పొందిన వారు తాము బాధితులమని మరిచి బాధ్యతలు మోస్తున్నారు.

బాలిక తల్లికి ఉద్యోగం

కాకినాడ దుమ్ములపేటలో 2020లో ఓ దారుణ ఘటన జరిగింది. నాలుగేళ్ల పసిమొగ్గపై ఓ దుర్మార్గుడు గంజాయి మత్తులో అత్యంత దారుణంగా అత్యాచారానికి ఒడిగట్టాడు. ఇంట్లో నిద్రపోతున్న చిన్నారిని ఎత్తుకెళ్లి అఘాయిత్యం చేశాడు. ఛిద్రమైన లోపలి భాగాలు గాయాల నుంచి కోలుకోవడానికి చిన్నారికి రెండేళ్లు పట్టింది. నాలుగు శస్త్ర చికిత్సలు చేశారు. బాధిత బాలిక కుటుంబానికి ఆసరాగా వన్‌స్టాప్ సెంటర్ నిలిచింది. సోషల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్‌లో హాస్టల్‌లో ఆమెకు అటెండర్ ఉద్యోగం దక్కింది. అలాగే సుమారు రూ.15 లక్షల ఆర్థిక సాయం అందింది.

తండ్రే మృగాడు...

2019లో రంపచోడవరం శివారులో ఓ పొలంలో పాక వేసుకొని ఓ తండ్రి ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు నివాసం ఉంటున్నారు. వైద్య, ఆరోగ్య సిబ్బంది ఓ సందర్భంలో సాధారణ వైద్య పరీక్షలకు వెళితే ఆ కుటుంబంలో పెద్ద కుమార్తె అయిన 14 ఏళ్ల మైనర్ గర్భవతి అని తేలింది. ఖంగుతిని ఆరా తీస్తే తల్లి లేని బిడ్డపై దారుణానికి ఒడిగడుతున్న పాపం తండ్రిదేనని తేలింది. బాలికను సఖి వన్ స్టాప్ సెంటర్ చేరదీసింది. సీడబ్ల్యూసీ తీర్మానం మేరకు గర్భ విచ్ఛిత్తి చేశారు. అనంతరం రావులపాలెంలోని ప్రభుత్వ వసతి గృహానికి పంపి ఓపెన్ టెన్త్ చదివించారు. టైలరింగ్ నేర్పారు. కొద్ది రోజుల క్రితం ఐసీడీఎస్ పీడీ ప్రవీణ, వన్‌స్టాప్ సెంటర్ సెంట్రల్ అడ్మిన్ శైలజ కలిసి కలెక్టర్‌కు బాధితురాలి పరిస్థితిని నివేదించారు. కలెక్టర్ షణ్మోహన్ ఆదేశాలతో బాధితురాలికి వన్‌స్టాప్ సెంటర్‌లో మల్టీ పర్పస్ అటెండర్‌గా ఉద్యోగం లభించింది. ప్రస్తుతం ఆమె వయసు 19. కాకినాడ జీజీహెచ్‌లోని వన్‌స్టాప్ సెంటర్ చొరవతో ఆమె జీవితానికి ఓ ఆధారం ఏర్పడింది. ఈ ఐదేళ్ల బాధితురాలు వీరి సంరక్షణలోనే ఉంది. నిందితుడికి జీవిత ఖైదు పడడంతో ప్రస్తుతం రాజమహేంద్రవరం కేంద్ర కారాగారంలో శిక్ష అనుభవిస్తున్నాడు.



జీజీహెచ్‌లో వన్‌స్టాప్ సెంటర్

అత్యాచారానికి గురై బిడ్డను కని..

ప్రేమ పేరుతో వంచనకు గురై.. ఓ ప్రబుద్ధుడి కామానికి గర్భవతైన మరో బాలిక కథ ఇది. 2020లో ఈ సంఘటన జరిగింది. 17 ఏళ్ల బాలిక ఆరోగ్య రీత్యా గర్భవిచ్ఛిత్తికి అవకాశం లేకుండా పోయింది. దీంతో ప్రసవించాల్సిన అనివార్య పరిస్థితి ఎదురైంది. ఆ బాధిత బాలికను వన్‌స్టాప్ సెంటర్ చేరదీసింది. ఆమె బతుకుకు భరోసా కల్పించి, శిశువు సంరక్షణను బాధ్యతగా తీసుకుంది. నిందితుడిపై పోలీసులు నమోదు చేసిన కేసు ప్రస్తుతం విచారణలో ఉంది. బాధితురాలికి ప్రస్తుతం 21 ఏళ్లు కాగా, ఆమె కన్న ఆడ శిశువుకి నాలుగేళ్లు. పసిపాపను పెంచుకునేందుకు అష్టకష్టాలు పడుతున్న ఆమెకు వన్‌స్టాప్ సెంటర్‌లో మల్టీ పర్పస్ అటెండర్‌గా ఉద్యోగం లభించింది.

బాధితులకు శిక్ష కాకూడదు



అత్యాచారాల్లో దోషుల కంటే బాధితులు అనుభవించే వేదనే ఎక్కువ. బాధితులకు జరిగిన అమానుషం వారి పాలిట శిక్షగా పరిణమించకూడదు. ఈ ఆలోచన తోనే ఐసీడీఎస్ పీడీ ప్రవీణ సూచనలతో బాధితుల స్థితిగతులను కలెక్టర్‌కు నివేదించాం. ఆయన సానుకూలంగా స్పందించి ఉద్యోగాలు ఇచ్చేందుకు అనుమతిచ్చారు. కొద్ది పాటి జాప్యం కూడా లేకుండా పీడీ ప్రవీణ వారి నియామక ప్రక్రియలు పూర్తి చేశారు. అత్యాచార బాధితులు ఈ నెల 1వ తేదీ నుంచి ఉద్యోగాలు చేస్తున్నారు. మహిళలు, బాలికల సంరక్షణకు పీడీ ఆధ్వర్యంలో వన్‌స్టాప్ సెంటర్ ఎన్నో విలువైన సేవలు అందిస్తోంది.

– రంగనాథం శైలజ, సెంట్రల్ అడ్మినిస్ట్రేటర్, సఖి వన్‌స్టాప్ సెంటర్, కాకినాడ

క్లుప్తంగా

పుష్కర కాలువలో పడి వ్యక్తి మృతి

గండేపల్లి: ప్రమాదవశాత్తూ పుష్కర కాలువలో పడి ఓ వ్యక్తి మృతి చెందినట్లు గండేపల్లి ఎస్సై యూవీ శివ నాగబాబు తెలిపారు. ఆయన కథనం మేరకు.. గండేపల్లి మండలం ఉప్పల పాడుకు చెందిన లక్కాకుల వెంకటేశ్వరరావు (59) ఈ నెల 12న ఉదయం బహిర్భూమికి వెళ్లివస్తానని ఇంట్లో భార్యకు చెప్పి గ్రామంలో గల పుష్కర కాలువ వద్దకు వెళ్లారు. అప్పటి నుంచి ఇంటికి రాకపోవడంతో పలుచోట్ల వెతుకుతుండగా ఆదివారం ఉదయం తాళ్లూరులో పామాయిల్ తోట పక్కన పుష్కర కాలువలో వెంకటేశ్వరరావు మృతదేహం కనిపించింది. మృతుడి కుమారుడు తాతబ్బాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

ఆలయ పనులకు రూ.92 వేల విరాళం



లోవ అర్చకులకు రూ.92 వేల విరాళం అందజేస్తున్న దాతలు

తుని రూరల్: తలుపులమ్మ లోవ దేవస్థానంలో ఆలయ అభివృద్ధి పనులకు అనకాపల్లి జిల్లా నర్సీపట్నానికి చెందిన శ్రీరవి హేమ లీల సల్మాన్‌రాజు రూ.92 వేలు విరాళం ఇచ్చారని ఈఓ పెన్మెత్స విశ్వనాథరాజు తెలిపారు. ఆలయంలో పూజల అనంతరం వారికి అమ్మవారి శేషవస్త్రం, చిత్రపటం, ప్రసాదాలను అధికారులు అందజేశారు.

తలుపులమ్మ లోవకు పోటెత్తిన భక్తులు



లోవ ప్రాంగణంలో చెట్ల కింద వంటలు, భోజనాలు చేస్తున్న భక్తులు

తుని రూరల్: తలుపులమ్మ లోవ దేవస్థానానికి భక్తులు పోటెత్తారు. ఆదివారం వివిధ జిల్లాలకు చెందిన వేలాది మంది ప్రత్యేక వాహనాల్లో లోవకు తరలివచ్చారు. క్యూలైన్ల ద్వారా 20 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నట్టు ఇన్‌చార్జి డిప్యూటీ కమిషనర్, కార్యనిర్వహణ అధికారి పెన్మెత్స విశ్వనాథరాజు తెలిపారు, లడ్డూ, పులిహోర ప్రసాదాల విక్రయం ద్వారా రూ.1,43,085, పూజా టికెట్లకు రూ.1,17,620, కేశఖండన శాలకు రూ.10,040, వాహన పూజలకు రూ.6,400, కాటేజీలు, పొంగలి షెడ్లు, వసతి గదుల అద్దెలుగా రూ.58,932, విరాళాలుగా రూ.1,72,805 ఆదాయం సమకూరిందని ఈఓ తెలిపారు. పలువురు భక్తులు ఆలయ ప్రాంగణంలో చెట్ల కింద, ఉచిత షెడ్లలో వంటలు చేసుకుని భోజనాలు చేశారు.

ఊరికి పండగొచ్చింది..

- నేటి నుంచి ధనుర్మాసం ప్రారంభం
- పెద్ద పండగకు మోగిన నెల గంట
- నెల రోజుల పాటు పల్లెల్లో సందడి

ధనుర్మాసం రానే వచ్చింది.. ఊరికి పెద్ద పండగ తెచ్చింది.. హరిలో రంగ హరి అంటూ హరిదాసుల కోలాహలం మొదలు కానుంది.. దూడూబసవన్నలతో పల్లెలకు కళ సంతరించుకుంది.. కొత్త అల్లుళ్లు, వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారు స్వస్థలాలకు వచ్చేందుకు ఇప్పటి నుంచే ప్రణాళిక వేసుకుంటున్నారు.



ఆలమూరులో రంగవల్లులు వేస్తున్న బాలికలు



ప్రభను ఊరేగిస్తున్న భక్తులు (ఫైల్)



ఆలమూరు: తెలుగు సంస్కృతి, సనాతన సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలకు ప్రతీకగా నిలిచే మకర సంక్రాంతికి పల్లె సీమలు ముస్తాబవుతున్నాయి. మార్గశిర శుక్ల పౌర్ణమి, మూల కార్తె సోమవారం ఉదయం 5.49 గంటలకు సూర్యుడు ధనురాశిలో ప్రవేశించడంతో శ్రీమహా విష్ణువుకు అత్యంత ప్రీతిపాత్రమైన ధనుర్మాసం ప్రారంభమవుతుంది. దీనినే ప్రజలు గ్రామీణ ప్రాంతాల్లో నెల గంట అని పిలుస్తారు. ఈ నెల 16 నుంచి వచ్చే జనవరి 15న మకర సంక్రాంతి వరకూ నెల రోజుల పాటు ఈ ధనుర్మాసం ఉంటుంది. ఈ రోజుల్లో పల్లె ప్రాంతాల్లో ఆధ్యాత్మికత తాండవించనుంది. ఉమ్మడి జిల్లాలోని వైష్ణవాలయాల్లో ధనుర్మాస పూజలు చేసేందుకు దేవదాయ శాఖ ఏర్పాట్లు పూర్తి చేసింది.

సంప్రదాయాలకు నెలవుగా..

ధనుర్మాసం ప్రారంభం కావడంతో సంప్రదాయాలకు నెలవుగా మారనుంది. తెల్లవారు జామున ఇంటి ముంగిట ఆడపడుచులు వేసే రంగవల్లులు, హరిదాసు కీర్తనలతో మేలుకొలుపు, సంప్రదాయ పిండి వంటలు ఇలా పల్లెలు కళకళలాడనున్నాయి. సంక్రాంతిని పురస్కరించుకుని కోడి పందేలు, ఎడ్ల పందేలను నిర్వహించేందుకు నిర్వాహకులు సమాయత్తం అవుతుండటంతో పల్లెలు మరింత శోభాయమానంగా మారనున్నాయి. ఆవు పేడను సేకరించి భోగి పిడకలను తయారు చేసే పనిలో అంతా నిమగ్నమవుతున్నారు. సంప్రదాయ కళలుగా భావిస్తున్న కోడిపందేలను పోలీసుల కళ్లుగప్పి ఏవిధంగా నిర్వహించాలనే ఆలోచనలో పెందెంరాయుళ్లు ఉన్నారు. ఇప్పటికే పందెం కోళ్లను జీడిపప్పు, బాదం పప్పు వంటి పౌష్టికాహారంతో పెంచుతున్నారు.

పాకశాలలుగా పల్లెలు

సంక్రాంతి ప్రారంభం కావడంతో గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి లోగిలి పిండి వంటల తయారీలో పాకశాలగా మారనుంది. ఇంటికి వచ్చే కొత్త అల్లుళ్లు, దేశ విదేశాల నుంచి వచ్చే కుటుంబ సభ్యులు, బంధువులకు తెలుగు సంప్రదాయ వంటకాలైన సున్నుండలు, కజ్జికాయలు, జంతికలు, గవ్వలు, పోకుండలు తదితరాలు తయారు చేసేందుకు మహిళలు ఉవ్విళ్లూరుతున్నారు. ధనుర్మాసంలో రైతులకు పంట చేతికందడంతో సంక్రాంతిని మరింత ఉత్సాహంగా జరుపుకొనేందుకు సన్నద్ధమవుతున్నారు. ఇక నుంచి గ్రామీణ ప్రాంత ప్రజలు సంక్రాంతి పండగ కోసం నూతన వస్త్రాలు కొనుగోలు చేయడంతో పాటు తమ లోగిళ్లను సర్వాంగ సుందరంగా అలంకరించే పనిలో నిమగ్నం కానున్నారు. ఇతర దేశాలు, రాష్ట్రాల్లో నివసించే తెలుగు ప్రజలు కచ్చితంగా స్వగ్రామానికి రావడం ఏళ్ల తరబడి ఆనవాయితీగా వస్తుంది. ఇప్పటికే విమానం, రైలు, బస్ టికెట్లు బుక్ చేసుకున్నారు. స్వగ్రామానికి రావడానికి ఎంత ఖర్చయినా వెనకాడకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లలో పల్లె ప్రాంత వాసులు నిమగ్నమయ్యారు.

ప్రభల ఉత్సవాలకు ప్రత్యేకత

ప్రకృతి అందాలతో ప్రత్యేకత సంతరించుకున్న కోనసీమలో అనేక దర్శనీయ స్థలాలు, దివ్యక్షేత్రాలు ఉన్నాయి. అయితే ఏ దేవాలయం లేకుండా ఏకాదశ రుద్రులుగా భావించే ప్రభల ఉత్సవాలు దేశ వ్యాప్తంగా ప్రాచుర్యం పొందాయి. సంక్రాంతి పండగను పురస్కరించుకుని రాష్ట్రంలో మరెక్కడా లేని విధంగా కోనసీమలోని సుమారు 15 మండలాల్లో ప్రభల తీర్థ మహోత్సవాలు అత్యంత వైభవంగా జరగనున్నాయి. తెలుగు సంస్కృతిని ప్రతిబింబించే ఈ ప్రభల ఉత్సవాలకు ప్రత్యేకత ఉంది. ఈ ప్రభలను పండగ మూడు రోజుల పాటు ఊరేగించి ఊరి పొలిమేరలు దాటిస్తే ఆ గ్రామానికి శుభం కలుగుతుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం. జిల్లాలోని ఆయా గ్రామాలు, పట్టణాల్లో పోటీపడి భక్తులు ప్రభల ఉత్సవాలను జరుపుతున్నారు. బాణసంచా పేలుళ్లతో తమ ప్రాంతాలకు ఆధిపత్య ధోరణిని చూపించుకుంటారు. ఈ ప్రభల ఉత్సవాలతో వేదసీమగా కోనసీమ ప్రాచుర్యం పొందింది.

దూడూబసవన్నల సందడి

హరిదారులు.. జంగమదేవరలు.. కొమ్మదాసుల రాక ధనుర్మాసం నుంచి మొదలుకానుంది. వీరు పల్లెలు, పట్టణాలు తిరుగుతా సందడి చేయనున్నారు. సంప్రదాయాలకు పట్టంకడుతూ వీరు చేసే సందడి అంతా ఇంతా కాదు. మన సంప్రదాయాలను నేటి తరాలకు అందించడంలో వీరు పోషిస్తున్న పాత్ర ఎనలేనిది.



గంగిరెద్దు విన్యాసాలు

ఈ మాసంలో పూజలు చేస్తే శుభాలు



శ్రీమహా విష్ణువుకు అత్యంత్ర ప్రీతిపాత్రమైన ధనుర్మాసంలో నెల రోజుల పాటు వైష్ణవాలయాల్లో పూజలు చేస్తే అన్ని దుర్గుణాలు తొలగి సుఖశాంతులు కలుగుతాయి. కోరిన కోర్కెలు నెరవేరి సకల శుభాలు జరిగి ఆయురారోగ్యాలు పొందుతారు. ఈ ధనుర్మాసానికి పురాణాల్లో చాలా విశిష్టత ఉంది.

– అంగర వేణుగోపాలాచార్యులు, అయ్యప్పస్వామి ఆలయ పురోహితుడు, ఆలమూరు

తెలుగు వారికి పెద్ద పండగ



అత్యంత భక్తి శ్రద్ధలతో, అభిరుచులకు తగ్గట్టుగా పల్లె సీమల ప్రజలు సంక్రాంతి పండగను జరుపుకొంటారు. ప్రపంచంలో ఏ మూలన ఉన్నా సంక్రాంతికి ఇంటికి వచ్చేందుకు ఉవ్విళ్లూరుతుంటారు. సంక్రాంతి పేరు వినగానే తెలుగువారికి పెద్ద పండగే.

– ఎం.వీరబాబు, ఆలమూరు

ప్రత్యేక అనుభూతి మిగిల్చేలా..



తెలుగు ప్రజలు వృత్తి రీత్యా ఎక్కడ ఉన్నా సంక్రాంతికి తమ స్వస్థలానికి వచ్చేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకోవడం ఆనవాయితీగా వస్తుంది. కుటుంబ సభ్యులతో మూడు రోజుల పాటు పండగ చేసుకుని తిరుగు పయనమవుతారు. సంక్రాంతి అంటే అందరికీ ప్రత్యేక అనుభూతిని మిగుల్చుతోంది.

– వి.ఆదిలక్ష్మి, సంధిపూడి, ఆలమూరు మండలం

భక్తులకు ఇబ్బంది రానీయొద్దు



దేవస్థానం అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న ఈఓ సుబ్బారావు

అన్నవరం: సత్యదేవుని ఆలయానికి వచ్చే భక్తులకు ఇబ్బంది లేకుండా సేవలందించేందుకు సిబ్బంది కృషి చేయాలని అన్నవరం దేవస్థానం నూతన ఈఓ వి.సుబ్బారావు కోరారు. ఈఓగా బాధ్యతలు స్వీకరించిన తరువాత తొలిసారిగా ఆయన ఆదివారం దేవస్థానం అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా దేవస్థానంలోని వివిధ విభాగాల పనితీరుపై సమీక్షించారు. దేవస్థానంలోని సీ సెక్షన్ విభాగంలో లీజులు, షాపుల వేలం, అద్దెల వసూళ్ల గురించి ఆరా తీశారు. అదే విధంగా దత్తత ఆలయాల పనితీరు, వాటి ఆస్తులు, నిర్వహణ సాదకబాదకాలపై చర్చించారు. ఇటీవల దేవస్థానం దత్తత తీసుకున్న బలిఘట్టంలోని సత్యదేవుని ఆలయాన్ని సందర్శించాలని నిర్ణయించారు. అదే విధంగా దత్తత ఆలయమైన కోరుకొండ దేవస్థానం దత్తత ఉపసంహరించాలని గతంలోనే దేవదాయశాఖ కమిషనర్‌కు లేఖ రాసిన విషయం అధికారులు ఈఓకు తెలిపారు. ఇంజినీరింగ్ విభాగంలో జరుగుతున్న పనులు, త్వరలో చేపట్టబోయే నిర్మాణాల గురించి ఇంజినీరింగ్ అధికారులు వివరించారు. వ్రతాల విభాగంపై అనేక ఫిర్యాదులు వస్తున్నందున దానిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఈఓ ఆ విభాగం పర్యవేక్షిస్తున్న ఏసీ రామ్మోహన్‌రావును ఆదేశించారు. దేవస్థానంలో ఫైళ్లన్నీ దేవస్థానం డిప్యూటీ కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్‌ల ద్వారానే తన వద్దకు రావాలని ఆదేశించారు. దేవస్థానం డిప్యూటీ కమిషనర్ చంద్రశేఖర్, ఏసీ రామ్మోహన్‌రావు, ఈఈలు రామకృష్ణ, నూకరత్నం పాల్గొన్నారు.

రేపటి నుంచి స్పోర్ట్స్ అండ్ రీజినల్ మీట్

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని డాక్టర్ బీఆర్ ఏజీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ రీజినల్ మీట్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ వి.నాగేశ్వరరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మంగళవారం రీజినల్ మీట్‌ను రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ప్రారంభిస్తారని, ముఖ్య అతిథులుగా ఏపీ టెక్నికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ జి.గణేష్‌కుమార్, అమరావతి సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సీహెచ్ అనిల్‌కుమార్, టెక్నికల్ ఎడ్యుకేషన్ జాయింట్ డైరెక్టర్ వి.పద్మారావు, స్టేట్‌బోర్డు ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ సెక్రటరీ రామచంద్రరావు, టెక్నికల్ ఎడ్యుకేషన్ రీజినల్ జాయింట్ డైరెక్టర్ జె.సత్యనారాయణమూర్తి హాజరవుతారన్నారు. ఈ నెల 19న ముగింపు కార్యక్రమం సందర్భంగా బహుమతి ప్రదానోత్సవం జరుగుతుందని తెలిపారు.

అథ్లెటిక్స్ పోటీల్లో క్రీడాకారుల ప్రతిభ



అక్కు అంతర్ కళాశాలల అథ్లెటిక్స్‌లో పతకాలు సాధించిన డీఎస్‌ఏ అథ్లెట్‌లు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): ఆదికవి నన్నయ యూనివర్సిటీ ప్రాంగణంలో ఈ నెల 13, 14 తేదీల్లో జరిగిన అక్కు అంతర్ కళాశాలల అథ్లెటిక్స్ పోటీల్లో కాకినాడ డీఎస్‌ఏ క్రీడా మైదానంలో శిక్షణ పొందుతున్న అథ్లెట్‌లు పలు విభాగాల్లో పతకాలు సాధించారని అథ్లెటిక్స్ కోచ్ ప్రవీణ్ ఆదివారం తెలిపారు. ఆర్.ప్రవీణ్‌కుమార్ 100 మీటర్ల పరుగులో రజత, 200 మీటర్ల పరుగులో కాంస్య, బి.దుర్గా ప్రశాంత్ 100 మీటర్ల పరుగులో కాంస్య, 400 మీటర్ల రిలేలో రజత, పి.నానిబాబు 400 మీటర్ల రిలేలో రజత, కె.మణికంఠ హైజంప్, లాంగ్ జంప్‌లో బంగారు, 400 మీటర్ల రిలేలో రజత, వై.జోగినాయుడు హ్యామర్ త్రోలో బంగారు, షార్ట్‌పుట్‌లో కాంస్య, కె.సుభాష్ 400 మీటర్ల హడిల్స్‌లో కాంస్య, 400 మీటర్ల రిలేలో రజత పతకాలు సాధించారన్నారు. బి.దీపిక 100 మీటర్ల పరుగు, లాంగ్ జంప్‌లో రజత పతకాలు, 400 మీటర్ల రిలేలో కాంస్య, ఎస్.సాయిదీపిక 100 మీటర్ల హడిల్స్‌లో బంగారు, 100 మీటర్ల పరుగులో కాంస్య, 400 మీటర్ల రిలేలో కాంస్య, వి.నాగలక్ష్మి 5 వేల మీటర్ల రేస్‌వాక్‌లో బంగారు, 10 వేల మీటర్లలో రజత పతకాలు కైవసం చేసుకున్నారు. వీరు అథ్లెటిక్స్ కోచ్ ప్రవీణ్ వద్ద శిక్షణ పొందుతున్నారు. పతకాలు సాధించిన క్రీడాకారులను డీఎస్‌డీఓ శ్రీనివాస్ కుమార్ ఆదివారం అభినందించారు.

అంటు మొక్క.. ఎంచక్కా

ఒకవైపు వంగ, మరోవైపు టమాటా కాయలు

ఆలమూరు: సృష్టిలో వింతలు, విడ్డూరాలు అప్పుడప్పుడు చూస్తుంటాం. ఒకే చెట్టుకు రెండు రకాల పండ్లు కాయడం, పూలు పూయడం వినే ఉంటాం. కానీ ఆలమూరు మండలం చింతలూరులో ఒకే మొక్కకు టమాటా, వంకాయలు కాసి అందరినీ అబ్బుర పరుస్తుంది. ఆ గ్రామానికి చెందిన ఎం.కరుణాకర్‌బాబు తన పెరట్లో ఈ ఏడాది అక్టోబర్ 11న టమాటా, వంగ మొక్కలను కలిపి (గ్రాఫ్టింగ్) అంటు కట్టాడు. మొక్క ఎదుగుదలకు అనేక సస్య రక్షణ చర్యలు తీసుకోవడంతో పక్వానికి వచ్చి పూత పూసి కాయలు కాస్తుంది. అందులో ఆ మొక్కకు ఒకవైపున టమాటా, మరోవైపున వంకాయ కాసింది. ఉద్యాన రైతులంతా ఇదే విధానం పాటించి కూరగాయలు పండిస్తే అధిక దిగుబడులు సాధించడంతో పాటు తక్కువ విస్తీర్ణంలో ఎక్కువ పంటలు పండే అవకాశం ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతుంది.



చింతలూరులో అంటు మొక్క వద్ద రైతు కరుణాకర్‌బాబు

అంటుకట్టే విధానం ఇలా!

టమాటా మొక్క కణజాలం లేదా చిగురుతో వంగ మొక్కలో గ్రాఫ్టింగ్ పద్ధతిలో ఏకం చేసి 18 రోజుల పాటు నీడలో ఉంచాలి. ఆ విధంగా చేయడం వల్ల ఆ అంటుకట్టిన మొక్కకు ఒకే విధంగా నీరు, పోషకాలు చేరి మొక్క వృద్ధి చెందుతోంది. దీనివల్ల ఆ మొక్కకు తెగుళ్ల తట్టుకునే శక్తి పెరగడంతో పాటు నీటి ఎద్దడిని తట్టుకునే అవకాశం ఉంటుంది. సాధారణంగా టమాటా మొక్క కేవలం రెండు నెలలు మాత్రమే కాయలు కాస్తుంది. కాని ఈ గ్రాఫ్టింగ్ విధానంలో టమాటా జీవితకాలం పెరగడంతో పాటు అధిక దిగుబడి వస్తుందనే విషయాన్ని సహచర ఉద్యాన ప్రేమికుల నుంచి తెలుసుకుని ఈ పద్ధతిని అవలంబించినట్లు రైతు కరుణాకర్‌బాబు తెలిపారు. సొలనేసి జాతికి చెందిన టమాటా మొక్కను అదే జాతికి చెందిన వంగ మొక్కతో కలిపి అంటుకడితే రెండు రకాలను కాసే అవకాశం ఉంటుందని కొత్తపేట డివిజన్ ఉద్యాన శాఖాధికారి జి.కోటేశ్వరరావు తెలిపారు. దీనిని వాడుక పరిభాషలో బ్రోమోటాగా పిలుచుకుంటామని అన్నారు.

విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

గోపాలపురం: గోపాలపురం పెద్దగూడెం గ్రామానికి చెందిన ఓ ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఆదివారం ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. ఇక్కడి చర్చిలో పాస్టర్ ఏలేటి భూషణం ప్రార్థనలు చేస్తుండగా, ఒక్కసారిగా ఇంటి నుంచి మంటలు రేగి ఇంట్లోని సుమారు రూ.4 లక్షల విలువైన సామగ్రి కాలిపోయింది. జంగారెడ్డిగూడెం నుంచి అగ్నిమాపక శకటం వచ్చేలోపు స్థానికులు మంటలను అదుపు చేశారు. పాస్టర్ భూషణంకు పాస్టర్ ఫిలోషిప్ నాయకులు రూ.5 వేల విలువైన సామగ్రిని అందజేశారు.



పెద్దగూడెంలో ఇంట్లో కాలిపోయిన వస్తువులు

చలికాలం.. వ్యాధుల గాలం

- గొర్రెలు, మేకలకు తిక్కరోగం సోకే ప్రమాదం
- ముందస్తు జాగ్రత్తలు తీసుకోకుంటే నష్టం

రాయవరం: చలికాలం ప్రారంభమవుతోంది. గొర్రెలు, మేకల పెంపకందారులు ఈ కాలంలో ముందస్తు చర్యలు చేపట్టాల్సి ఉంటుంది. లేకుంటే జీవాలు వివిధ వ్యాధుల బారిన పడే ప్రమాదముంది. ఈ నేపథ్యంలో జీవాల యజమానులు, కాపర్లు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలను రాయవరం మండల పశు వైద్యురాలు ఎ.నాగశ్రావణి తెలిపారు. ఆ వివరాలు ఇలా..

వచ్చే వ్యాధులివే..

మూగజీవాలకు పీపీఆర్ (పారుడు) వ్యాధి, అర్స్ వ్యాధి, మసూచి, చిటుక తదితర వ్యాధులు చలికాలంలో వస్తాయి. వ్యాధికారక సూక్ష్మజీవులు శరీరంలో ఉండడం వల్ల మందలో ఉన్న మిగిలిన గొర్రెలు, మేకలకు వ్యాపిస్తుంది. వీటి పెంపకందారులు తగిన జాగ్రత్తలు పాటిస్తే వ్యాధులు రాకుండా చూసుకోవచ్చు. ఒకవేళ వ్యాధి సోకినా తీవ్రత తగ్గించేందుకు అవకాశం ఉంది. మరణాలను అరికట్టవచ్చు.

పాడి-పంట

కీటకాలతో జాగ్రత్త

దోమలు, కీటకాల నుంచి గొర్రెలు, మేకలకు చలికాలంలో తిక్క (సర్ప) రోగం ప్రభావం ఎక్కువగా ఉంటుంది. నదులు, వాగులు, వంకలు వెంట సంచరించే గొర్రెలు, మేకలు తిక్క రోగం బారిన పడతాయి. దోమకాటు ద్వారా వచ్చే ఈ వ్యాధిని త్వరగా గుర్తించకపోతే జీవాలు మృతి చెందవచ్చు. పెంపకందారులు ముందుగా వ్యాధిని గుర్తించి నివారణ చర్యలు తీసుకోవాలి.

నివారణ ఇలా..

ముందస్తు చర్యల్లో భాగంగా సాయంత్రం పాకలు, మందల వద్ద వేపాకు ధూపం వేస్తే కీటకాలు మంటకు ఆకర్షితమై నశిస్తాయి. తిక్క రోగం నుంచి కాపాడుకునేందుకు సాయంత్రం వేళ పాకలు, మందలు ఉన్నచోట వేపాకు పొగ పెట్టాలి.





చలి తీవ్రత ఎక్కువైతే..

చలి తీవ్రత ఎక్కువైతే న్యూమోనియా (ఉమ్మి) రోగం వచ్చే ప్రమాదం ఉంది. ఇక గొర్రెలు, మేకలను చలి బారి నుంచి రక్షించడం కోసం పాకలు ఏర్పాటు చేసి వాటికి న్యూమోనియా (ఉమ్మి) వ్యాధి సోకుండా కాపాడుకోవాలి. గొర్రెలు, మేకలకు వ్యాధులు సోకినట్లైతే వాటిని గుర్తించి మంద నుంచి వేరు చేసి ప్రత్యేక ప్రదేశంలో ఉంచి చికిత్స చేయించాలి. అలాగే వ్యాధి సోకిన జీవాలకు సులువుగా జీర్ణమ య్యే ఆహారం, పరిశుభ్రమైన తాగునీరు ఇవ్వాలి. పూర్తిగా వ్యాధి నుంచి కోలుకున్న తర్వాత మాత్రమే వాటిని మందలో కలపాలి. అలాగే వ్యాధులు సోకిన జీవాలను ఇతర ప్రాంతాలకు తీసుకు వెళ్లకూడదు. అలా చేస్తే వ్యాధి తీవ్రత పెరిగి అవి చనిపోతాయి. ఒకవేళ గొర్రె, మేక మృతి చెందితే దాని కళేబరాన్ని ఊరికి దూరంగా తీసుకువెళ్లి లోతుగా గొయ్యి తవ్వి సున్నం వేసి పూడ్చిపెట్టాలి. అవి చనిపోయిన ప్రదేశాన్ని క్రిమిసంహారక ద్రావణంతో శుభ్రం చేయాలి. చనిపోయిన జీవం తినగా మిగిలిన గడ్డి కూడా కాల్చివేయాలి. నీటి పాత్రలను క్రిమి సంహారక ద్రావణంతో శుభ్రం చేసి ఎండలో ఆరబెట్టాలి.

కొడుకు ఉద్యోగం తొలగించారని

ఆవేదనతో తండ్రి మృతి

పారా మెడికల్ ఉద్యోగి తండ్రికి గుండెపోటు



కొవ్వూరులో ఉద్యోగాన్ని, తండ్రిని కోల్పోయిన నెహ్రూను పరామర్శిస్తున్న రాష్ట్ర పారా మెడికల్ అసోసియేషన్ ఉద్యోగుల సంఘు కన్వీనర్ ప్రసాద్

కొవ్వూరు: కన్న కొడుకును ఉద్యోగం నుంచి తొలగించారనే ఆవేదనతో కొవ్వూరు పట్టణానికి చెందిన పారా మెడికల్ ఉద్యోగి నెహ్రూ తండ్రి ఒగ్గు ఆశీర్వాదం రెండు రోజుల కిందట గుండెపోటుతో మృతి చెందారు. ఈ మేరకు రాష్ట్ర పారా మెడికల్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కన్వీనర్ జీవీవీ ప్రసాద్ కొవ్వూరులోని నెహ్రూ ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఉన్న ఉద్యోగంతో పాటు, కన్న తండ్రిని కోల్పోయిన నెహ్రూ కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని, సంతాపాన్ని తెలిపారు. తెలంగాణ హైకోర్టు జీఓ 1207ను డిస్మిస్ చేసినప్పటికీ దానిని అనుసరించి రాష్ట్ర ప్రభుత్వం 1200 మంది పారా మెడికల్ కాంట్రాక్టు హెల్త్ అసిస్టెంట్లను ఉద్యోగాల నుంచి తొలగించడం అన్యాయమన్నారు. 22 ఏళ్ల పైబడి వైద్య, ఆరోగ్య శాఖలో సేవలందిస్తున్న వారిని ఉన్నపళంగా రోడ్డుపైకి నెట్టడం అన్యాయమన్నారు. యాభై ఏళ్లు పైబడిన వారిని తొలగిస్తే బయటకు వచ్చి ఏం చేయలేని పరిస్థితి ఉందన్నారు. ఎలా బతకాలన్న ఆందోళనతో నాలుగు రోజుల వ్యవధిలో రాష్ట్ర వ్యాప్తంగా ముగ్గురు మృతి చెందారన్నారు. కొడుకుల ఉద్యోగాలు పోయాయని నర్సీపట్నానికి చెందిన గొలుసు అప్పారావు, కొవ్వూరుకు చెందిన ఆశీర్వాదం గుండెపోటుతో మృతి చెందారన్నారు. ఉద్యోగం పోతే తన భవిష్యత్తు ఏంటని గుంటూరు మలేరియా యూనిట్ హెల్త్ అసిస్టెంట్ కొల్లి లక్ష్మణ్ మానసిక వేదనతో కన్ను మూశారన్నారు. మూడు మరణాలు నాలుగు రోజుల వ్యవధిలో చోటు చేసుకోవడం బాధాకరం అన్నారు. ప్రజా దర్బార్‌తో ఈ అంశాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లనున్నారు. తొలగించిన హెల్త్ అసిస్టెంట్లను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరామన్నారు.